# ఏడడుగులు - మరో తప్పటడుగు




పదేళ్ళ తర్వాత ప్రకాశం కనిపించాడు నాకు.

ఆకాశం అందుకొన్నంత సంబరం అయిందికాదూ మరి. నాలుగో క్లాసు నుంచి డిగ్రీ పుచ్చుకునేవరకూ కలిసే చదువుకున్నాం. డిగ్రీ పుచ్చుకున్న రెండు నెలలకే ప్రకాశం ఉద్యోగం సంపాదించుకోటంతో వెళ్ళిపోయాడు. ఆ తర్వాత మరో ఇరవై నెలల కుదుర్చుకుంటూ నా పెళ్ళికి వచ్చాడు.

అంతే! ఆ తర్వాత దర్శనం లేదు!!

రోడ్డుమీద కామరాజుగారి దుకాణం దగ్గర కూచుని కబుర్లు చెబుతున్న నాకు, ప్రకాశం కొంచెం దూరం ఉండగానే కనిపించాడు. అవునో కాదోనని సందేహించాను.

'సింగపూర్‌వాసంట మాస్టారూ! అతను మీ ప్రకాశమే!' అన్న కామరాజుగారి పలుకులు విన్న తర్వాతనే నేనతన్ని పిలువగలిగాను

'ప్రకాశం ప్రకాశం'

చప్పట్లు వినిపించాయేమో, వెనక్కి తిరిగి చూశాడు ప్రకాశం.

ప్రకాశమే!

దగ్గరకు చేరిచేరగానే — 'నువ్వురా! ఓరినీ, ఎవరో అనుకున్నాను' అన్నాడు నన్ను కౌగలించుకునే ప్రయత్నం చేసి

నా మనసుకెంతో ఉల్లాసంగా ఉంది.

ఏడడుగులువేస్తే వారు మిత్రులవుతారని సూక్తి.

కానీ నేను ప్రకాశం కలిసే ఉన్నది దాదాపుగ పన్నెండేళ్ళు! పొరబాటుగనైనా కలహించుకున్న సందర్భాలు లేవన్నది అతిశయోక్తిగాదు.

ఇంటికి తీసుకొచ్చాను. కాఫీ కాద్దామని లేవబోయేసరికి రామం వచ్చాడు

'రామం, కాస్త కాఫీ కలిపి పెట్టు.' అన్నాను నేను

ఏమనుకున్నాడో ఏమో గానీ, రామం వెళ్ళిపోగానే అన్నాడు ప్రకాశం—'చాలా తప్పుపని చేశావురా!'

నాకు అర్థంగాలేదు ఏమిటని అడిగాను.

'నీ స్టూడెంటును కాఫీ కలిపి పెట్టమనటం...ఛ బాగాలేదురా!'

నేను నవ్వుతూ అన్నాను—'రోజూ అతనే కాస్తాడురా కాఫీ! అదో కథ లేరా!' అంటూ విషయాన్ని త్రుంచివేశాను.

రామం తెచ్చిన కాఫీలు తాగాము. తర్వాత అన్నాడు రామం—'ఈవేళ శాస్త్రులయ్యగారు రమ్మన్నారండీ! ఇంట్లో తోడెవరూ లేరుట. పాయసం వండుతా మన్నారు.'

సరే వెళ్ళమన్నాను ప్రకాశంతో ఏకాంతంగ ఉండచ్చనే ఊహతో.

ప్రకాశం—నా జీవిత చరిత్రలో ఒక భాగం. ప్రకాశం లేక నా జీవిత చరిత్ర లేదు. ప్రకాశంతో నా జీవితం రకరకాలుగ ముడివడి ఉంది. ఈ ముళ్ళు ఎలా పడ్డాయో, ఏ ముడి ఎవరు వేశారో ఎవరికీ అర్థంగాని పొడికథలు.

కనిపించిన ప్రతి వారికి సుభావంగా

వాళ్ళ ప్రశ్నలకు జవాబులిచ్చి రావిచెట్టు క్రింద రచ్చబండవద్దకు చేరుకున్నాము.

ప్రకాశంకన్న ముఖ్యంగ ఎదుటివారికి కనిపించేది అతనిలోని ధైర్యం—నాకు నవ్వొస్తుంది, అతను చేసిన ఒకటి రెండు పనులు చూసి. ముఖ్యంగా నా పెళ్ళి జరగడానికికూడ కారణం ప్రకాశంలోని ధైర్యం!

వెళ్ళక వెళ్ళక నేను ఏదో పనిమీద రాజమండ్రి వెళ్ళటం, అక్కడ ఆ అమ్మాయినిచూసి, వాళ్ళ కుటుంబం స్థితిగతులను విచారించడం, ఏదో లోకాభిరామాయణంలా అదే విషయాన్ని ప్రకాశానికి రాయటం...ఆ తర్వాత ఏం జరిగిందోకానీ, ఆ అమ్మాయి తండ్రి నన్ను పెళ్ళి చూపులకు రమ్మని కోరటం, తర్వాత పెళ్ళి జరగటం కూడ జరిగింది.

పెళ్ళియాకనే చెప్పాడు ప్రకాశం—వివాహానికి తను చేసినదేమిటో! నేననే ఒకణ్ణి ఈ ఊళ్ళో ఉన్నట్లు రాయటం, కట్నం ప్రధానం కాదనే విషయాన్ని తెలియబరిచి, ప్రయత్నించమనటంకూడ ప్రకాశం పాత్రే!

ప్రకాశం ధైర్యానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాను—ఎవరో తెలియని వ్యక్తికి, ఆ వ్యక్తి కుమార్తె పెళ్ళి విషయంలో ఆయాచితంగ సలహా అందివ్వటం అంత తేలికయిన పనికాదు.

ఉన్నట్టుండి అన్నాడు ప్రకాశం ఏదో. నాకు సరిగా వినిపించలేదు.

'ఏమిటి?' అన్నాను నేను అతనికేసి తిరిగి

'నీకు తెలియదా?'

'ఏ విషయం?'

'నిజంగానే నీకు తెలియదురా?' అన్నాడు ప్రకాశం ఆశ్చర్యపోతూ ఈసారి కొంచెం విసుగ్గానే అడిగాను—'ఏ విషయం అని?'

'రాజ్యానికి పెళ్ళయింది.'

రాజ్యం!

మనసు మొద్దుబారి పోయింది.

సందేహం తీర్చుకోవాలనే అడిగాను మళ్ళీ—'ఎవరికి?'

'మీ రాజ్యానికేరా! నీ కసలు తెలియదా?'

జవాబివ్వలేకపోయాను నేను,

ఆశ్చర్యమో, దుఃఖమో, సంభ్రమమో—అసలు ఆ పరిస్థితిని ఏమంటారో, ఆ స్థితిని చెప్పటానికి తెలుగులో ఒకపదం ఉందో లేదో కూడ నాకు తెలియదు.

ఏమీ చెప్పకపోతేనే బాగుండనిపించింది—చెప్పదలుచుకున్నా, ఏం చెప్పాలి?

లేచి నిలబడ్డాను పోదాం అన్నట్లు.

ప్రకాశం నన్ను అనుసరించాడు.

*    *    *

రాత్రి...

కుంపటిమీద గిన్నెలో కుతకుత ఉడుకుతోంది అన్నం.

ఏవేవో ఆలోచనలు!—పనిచేస్తున్నాకాని మనసు నా స్వాధీనంలో లేదు. తన ఇష్టమున్నట్లు ఎక్కడెక్కడో సంచరిస్తూ, ఏవేవో విషయాలను జ్ఞప్తికి తెచ్చుకుంటోంది.

అసలు ఇలా జరిగిందా?

లేకపోతే—లేకపోతే ఇది కేవలం ప్రకాశం కల్పితమా?

ఛ!—మనిషిని, అందులోనూ చిన్ననాట నుండి ప్రాణానికి ప్రాణంగ మసలిన స్నేహితుణ్ణి నమ్మకపోవడం...

కానీ, ఎందుకిలా జరిగింది?

రాజ్యం ఇలా చేయగలిగిందా?

స్వరాజ్యలక్ష్మి—

ఆ పేరే నాలో మధురస్మృతులను రేపుతుందే!

కానీ...ఏమిటిది?

ఇలా చేయగలిగిందా రాజ్యం?

మళ్ళీ పెళ్ళిచేసుకో గలిగిందా?

నన్ను మర్చిపోయి...

అసలెలా మర్చిపోగలిగింది?

నే నెందుకు మర్చిపోలేక పోతున్నాను—నాకూ రాజ్యానికి పెళ్ళయి ఆరేళ్ళయింది. ఆరేళ్ళం తక్కువకాలం గాదు. ఎంతో ఈ కాలంలో మర్చిపోయి ఉండచ్చు. పాత స్మృతులకు, పాత సంఘటనలకు సమాధి కట్టి, ఆ సమాధిమీదే నూతన కాంక్షలనే విత్తనాలు చల్లుకొని, హాయిగ మరో జీవితం గడుపుకోవచ్చు.

కాదనను.

కానీ.. రాజ్యం నన్నింత త్వరగ మర్చిపోయి, వేరొకతన్ని పెళ్ళాడటం జరగని పని! కానీ ప్రకాశం జరిగిందనే అంటున్నాడు.

'ప్రకాశం!'

ప్రకాశం రాగానే వింతో శక్తి కూడగట్టుకొని అన్నాను నేను—'నేను నమ్మనురా!'

మౌనంగ తల దించుకున్నాడు ప్రకాశం. చాలసేపుతర్వాత అన్నాడు—'మొదట నేనే నమ్మలేదు. కానీ పెళ్ళినినాకూ ఇన్విటేషన్ వచ్చింది.

ఆశ్చర్యపోయాను—'ఉందా నీ దగ్గర?' అడిగాక బాధపడ్డాను—'చింపుకడిగావా' అని.

కాను — ప్రపంచంలో ఎందరివో పెళ్ళిళ్ళు నాకు తెలియకుండానే జరిగిపోతున్నాయి. మనకు తెలియనంత మాత్రాన కలిగే నష్టంలేదు. తెలిస్తే జరిగే లాభం లేదు.

కానీ...

ఇది స్వరాజ్యలక్ష్మి పెళ్ళి!

స్వరాజ్యలక్ష్మి నాకు 'ప్రపంచంలో ఎవరో కాదు—నాకున్న ప్రపంచం అంతా ఆమే'

ప్రకాశం తిరిగి వచ్చాడు శుభలేఖతో. అందుకున్నాను.

నా అర్ధాంగి వివాహమహోత్సవ 'శుభలేఖ!'

నాకేసి అనునయంగ చూశాడు ప్రకాశం. తలత్రిప్పుకొన్నాను ప్రక్కకు—కంటో నీరు తిరుగుతోంటే!

'నేనొకటి అడగనా?'

ప్రక్కకు తిరిగిచూశాను ప్రకాశంకేసి

'నిజం చెబుతావురా?'

'అనుమానం ఏమయినా ఉందా నీకు?'

'లేదనుకో...'

'ప్రకాశం, నువ్వుకదరా నా పెళ్ళి పెద్దవు—నీ దగ్గర అబద్ధం ఎలా చెప్పగలనురా?' అందామనుకున్నా కానీ, ఈ స్వరాజ్యలక్ష్మి పెళ్ళి నాలోతడిని ఇంకింప జేసింది. అందుకే ఏమీ అనలేకపోయాను

'నువ్వు స్వరాజ్యానికి విడాకులు ఇచ్చావా?'

ఆశ్చర్యపోయినా జవాబు ఇచ్చాను—'లేదు'

ఈసారి ఆశ్చర్యపోయింది ప్రకాశం—'నిజమా?'

'నిజమే!'

'మరేమీ అనుకోకు—మీ ఇద్దరిమధ్య

## ఏ డ డు గు లు...

'గొడవలేమైనా వచ్చాయా?'

చొప్పరంటు ప్రశ్న!

గొడవ రాకుండా ఇంత ఎలా జరుగుతుంది?

కానీ గొడవ వచ్చిందా అన్నది నాకూ అనుమానమే!

ఆలోచిస్తేనేగానీ అర్థంగాదు—

*   *   *

పదిన్నర దాటింది. నాకు సెకండ పీరియడ్‌గానీ క్లాస్‌లేదు. అందుకే దూరంగ ఉన్న చింతచెట్టు క్రిందకు వెళ్లి కూర్చున్నాను ఏదో ఆలోచిస్తూ.

'మాష్టారూ!'

ఎవరో పిలిచినట్లు అయి, ఇటుకేసి తిరిగాను—పదేళ్ళ, పదకొండేళ్ళంటాయేమో! చింపిరిజుత్తు, లాగు, చొక్కా... ఎవరో!

'ఏంకావాలి?' అన్నాను నేను లేస్తూ.

ఆ అబ్బాయి తడబడ్డాడు. ఏంచెప్పాలో తోచలేదనుకుంటా ఆ అబ్బాయికి.

'చెప్పు.'

'మరేం...మా నాన్న పోయాడండి!' కంఠంలో దుఃఖం కొంత తొంగిచూసింది. 'మాదీ ప్రక్కఊరేనండి! మా నాన్నపోయి పదిరోజులయిలది' అన్నాడు ఆ అబ్బాయి. నాకు అంతా అర్థమయింది.

బహుశా పదో, పాతికో పైసలు కావాలంటాడు. జేబులో చెయ్యిపెట్టి, చేతికి దొరికిన పావలా కాసు తీశాను.

'తీసుకో!' అన్నాను నేను.

బిడియపడ్డాడు.

నాకు ఆశ్చర్యం వేసింది—ఇలా అబ్బాయిలు రావటం, ఏవో కాగితాలు గట్రా చూపి, డబ్బులు వసూలు చేసుకోవటం మామూలే! కానీ ఇలా డబ్బులు తీసుకోవటానికి బిడియపడ్డాడు వీడే!

'తీసుకో, ఫర్వాలేదు.' అన్నాను నేను మళ్లీ.

'డబ్బులు అక్కరలేదండీ!'—అన్నాడు సందేహంగనే ఆ అబ్బాయి

ఆశ్చర్యపోతూ ప్రశ్నించాను-'మరింకేం కావాలి?'

'నాకు...నాకు...'

'చెప్పు—' అన్నాను నేను ప్రోత్సహిస్తూ.

'నాకు...చదువుకోవాలని ఉందండీ! మీరు...వారాలు ఏర్పాటు చేయిస్తే...'

అదిరిపడ్డాను.

'ఇలారా, కూర్చో' అన్నాను నేను.

'ఫర్వాలేదండీ' అంటూనే కూర్చున్నాడు ఆ అబ్బాయి.

'నీపేరేమిటి?'

'రామం.'

'మీ నాన్న ఏం చేసేవాడు?'

'...రిక్షా లాగేవాడండి.'

'ఎలా పోయాడు?'

'మరేమోనండి...కరణంగా రబ్బాయిగారి కారుక్రింద పడిపోయాడండి.'

'మరి, కరణంగారేమైనా ఇచ్చారా నీకు?'

'డబ్బాండీ?...లేదండి. ఇన్నాళ్ళా వాళ్లింట్లోనే ఉన్నాను గదండి.' అన్నాడు రామం. అతనిలో ఇప్పుడంత బిడియం, కొత్త లేవు.

'మరి, కేసు గట్రా ఏమయినా?'—సందేహిస్తూనే అడిగాను. కరణంగారికి ఉన్న పలుకుబడి నాకు తెలియందిగాదు.

చాలసేపు ఆ అబ్బాయి అలాగే కూర్చున్నాడు. చివరకు మెల్లిగ అన్నాడు—'మాష్టారూ! మీరేం చెప్పారుకారు—'

అవును, ఆ అబ్బాయికి ఏదో చెప్పాలి!

'నా ఇంట్లో ఉండువుగాని...'అన్నాను నేను.

ఆ అబ్బాయికి సంతోషం వేసింది గాబోలు—ముఖం విప్పారింది.

'ఏ వారం అండి?'

'వారంరోజులూ మా ఇంట్లోనే ఉందువుగానిలే!' అన్నాను నేను.

ఇంటికి తీసుకొచ్చాను రామాన్ని.

స్వరాజ్యలక్ష్మి—అదే, నా అర్థాంగి—నే చేసినపనికి ఎంతగనో సంతోషపడిపోతుందని నేను అనుకోలేదు, కానీ ముభావంగా మాత్రం ఉంటుందనుకోలేదు.

రామం స్నానం చేశాడు—వచ్చేటప్పుడు నేను కొన్న రెడీమేడ్ లాగు చొక్కా వేసుకున్నాడు. తల దువ్వుకునేసరికి—ఆకర్షణీయంగనే ఉన్నాడు.

'వెళ్లి వీధిగదిలో కూర్చో' అన్నాను నేను రామంతో.

రామం వెళ్లిపోయాడు.

వంటఇంటిలో కుంపటిమీద రాజ్యం కాఫీ కాస్తోంది. వెళ్ళాను. తలెత్తి చూసింది.

'చెప్పండి.'

'ఏం చెప్పను?' అన్నాను నేను కొంత హాస్యంగ.

'ఏంచెప్పాలని వచ్చారో అది—' అంది రాజ్యం. అంత కఠినంగా రాజ్యం నాతో మాట్లాడిన క్షణాలేవీ నాకు గుర్తులేవు.

విషయం కొంత కఠినంగానే ఉంది అనుకున్నాను.

'ఎవరా అబ్బాయి?'

'ఏమో! ఇన్నాళ్ళిదాకా ఎవరి అబ్బాయో కాని, ఇకపై మన అబ్బాయి.'



'అంటే...?'

'మన ఇంటిలో ఉండి చదువు కుంటాడు.'

ఏమనుకుందోగానీ, కొంతసేపు ఏమీ అన లేదు—'వారాల కుర్రాడా?'

'కాదు' అన్నాను నేను మనసులో చెల రేగుతున్న అశాంతిని ఆపుకుంటూ. 'కొంచెం కనిపెడుతూ ఉండు' అని లేచాను.

'కాఫీ తీసుకువెళ్లండి.' అంటూ నన్ను ఆపింది రాజ్యం— 'కనిపెట్టడం అంటే?'

ఈ ప్రశ్నకు జవాబులేదు నాదగ్గర. అందుకే తడుముకుంటూ జవాబిచ్చాను— 'అంటే...కొంచెం ఆలనాపాలనాచూస్తుండు. వేళకు తిండిగట్రా...'

'అడ్డమైన వెధవలకు చేయడం నా వల్లగాదు.'

ఆ ప్రయోగం నాకు ఎక్కడో తగిలింది. మళ్లీ కూర్చున్నాను. రాజ్యం మనసులోఉన్న ఈభావాన్ని తొలగించాలి ముందు. తర్వాత ఏదైనా!

'చూడు రాజ్యం, అతనూ మనలాటివాడే నని ఎందుకనుకోవు?'

'మనలాటివాడెలా అవుతాడు?' సూటి గనే అడిగింది రాజ్యం.

'కాదు రాజ్యం. ఆ భావం రానివ్వకోకు. మనం అంతా ఒకటే! అతనికి లేదు. మన కున్నది అతనికి కొంత పెడదాం:'

'ఎన్నాళ్లు?'

'ఏమో, ఇది నేనాలోచించలేదు. నాచేత నయినంతకాలం...'

'మీసంగతేమో కానీ, నాకసలు చేత గాదు—బజారులో వాళ్లకు చేయటం.'

'బాగా ఆలోచించు రాజ్యం! చదువు కుంటానని మన వంచ చేరాడు. మనకున్నది అతనికి కొంతపెడదాం. అది మానవత.'

'ఏమో...నాకుతెలియదు.' అంది కాఫీ అందిస్తూ.

'రామం, వచ్చి కాఫీ తీసుకెళ్లు' అన్నాను నేను.

నాకేసి ఒకసారి చూసి, గ్లాసులో కాఫీ పోసి ఇచ్చింది రాజ్యం.

మౌనంగా అందుకున్నాడతను.

* * *

'మీరసలు నాబాధ అర్థంచేసుకోరేం?'

ఆరోజు సాయంత్రం నేనూ రామం బజారులోకి వెళ్లి, రామానికి రెండుజతల బట్టలు, కంచం, గ్లాసు వగైరాలు కొని

## ఏడడుగులు...

ఇంటికి తిరిగి రాగానే రాజ్యం అడిగినప్రశ్న అది.

'నాకు తెలియదు—ఏమిటి నీ బాధ?'

'మీకెలా చెప్పను? ఈ అడ్డమైన వాళ్లకూ చాకిరీ చేయడం నావల్లగాదు. మీరు వినిపించుకోరేం? ఖచ్చితంగా చెబుతున్నాను—ఇతనిక్కడ ఉండడానికి వీల్లేదు.'

'ఏం?'

'నేనతనికి చెయ్యను గనుక!' వ్యవహారం పూర్తిగా చేయి దాటింది.

'నాకు చెయ్యగలవా?'

'మీకూ అతనికీ పోటీ ఏమిటి? మీరు నా భర్త. అతనెవరో...' ఎందుకో పూర్తి చేయలేదు రాజ్యం. కానీ నాకాభావం తెలుసు.

'అడ్డమైన వెధవ!'

'కాదు రాజ్యం; మనకు చేసిందే, అతనికి ఓరవ్వ పెడితేసరి—ఇందులో అధికంగా కష్టపడడం అంటూ ఏమిటి?'

'ఏమో — నాకు ఇష్టంలేదు.' చాల నిష్కర్షగా చెప్పింది రాజ్యం.

ఇందుకే నాకు రాజ్యం అంటే ఇష్టం! ముఖంమీద ఒకటి, మనసులో ఒకటి లేవు— కానీ మనసులో ఉన్నదే నాకు నచ్చటం లేదు.

వారం రోజులు ఇట్టే గడిచాయి.

తర్వాత కూడ ఒకసారి రాజ్యానికీ నాకూ ఇదే విషయంలో ఘర్షణ జరిగింది.

ఇది...నా ధర్మం. నేను చేసేది తప్పు కాదు. పైగా అది నా బాధ్యత!

* * *

'పరీక్షలు జరగటం, రాము పరీక్షలో పాసవటం జరిగింది.

స్కూళ్లు తెరిచారు — అప్పుడూ రాజ్యంతో ఈ విషయంలోనే గొడవయింది.

'మీరతనికి వారాలయినా ఏర్పాటు చేయండి!'

'ఎందుకు??'

'ఇంక నేను చేయను—వారానికి ఒక్క రోజంటే, ఏదో సరు కోగలను'

కానీ నేనంగీకరించలేక పోయాను — రాజ్యం వైఖరిలో తేడా వచ్చింది గనుక చాల సంతోషించాను. ఇంక కొన్నాళ్లు జరిగితే...ఫర్వాలేదు.

మర్నాడు స్కూలు నుంచి తిరిగి వచ్చే సరికి కాగితం ఎగురుతూ టేబిల్ మీద కనిపించింది—ఆత్రుతగా తీసి చూశాను.

'నేను వెళ్లిపోతున్నాను—రావటానికి వేరే ఏర్పాటు చేయగనే తెలియపర్చండి. వెంటనే వచ్చేస్తాను.'

'అల్టిమేటమ్!'

అయినా లొంగి పోలేను నేను.

అంతే! — తర్వాత రాజ్యానికి, నాకూ ఉత్తరాలు కూడ లేవు.

మొదట్లో చాల బాధ పడేవాణ్ణి — కానీ...

కానీ నేనేం చేయను?

ఈ నైతిక బంధాన్ని ఎలా తెంచుకోను?

అది నాకు వలను గాని పని.

* * *

అంతా విన్నాడు ప్రకాశం.

'కానీ...,నీదే తప్పు రా!'

ప్రకాశం అలా అనేసరికి ఆశ్చర్య పోయాను.

తప్పు నాదా?

'కాదురా ప్రకాశం! రామానికి చేసి నంత మాత్రంలో ఏ మునిగిపోతుంది?'

'ఏమో మరి! ఆవిడకు ఆ పట్టుదల ఉంటే, మనం తల ఒగ్గడం మంచిది. కొందరికి, తన వాళ్లకు తప్ప ఇతరులకు చేయడం ఇష్టం ఉండదు. అది మనమూ గ్రహించాలి.'

ఇక తప్పదు—ఎవరికీ చెప్పనిది ఇతనికి చెప్పాలి!

'కానీ, ప్రకాశం! అందరమూ అలానే ఎవరికివారే అనుకుంటే ఏమవుతాడు అతను?'

'ఏమో!'

'అంతేరా!—అందరూ అలానే అనుకుంటే నేనుకూడ ఇలా ఉండగలిగేవాణ్ణి కాదు. వెంకట్రామయ్యగారు నా తండ్రి కాదురా!'

ప్రకాశం నోరు తెరిచాడు ఆశ్చర్యంతో.

'...లోకంలో ఎవరికీ, ఆఖరికి రాజ్యానికి కూడ తెలియదురా!— నాకూ మొన్ననే వెంకట్రామయ్యగారు చెప్పాకనే తెలిసింది! నేను ఇలా చదువుకున్నవాడినే! ... నేను ఏ కులంలో పుట్టానో నాకే తెలియదు. బ్రాహ్మలకుర్రాడిగ, వెంకట్రామయ్యగారి అబ్బాయిగనే చలామణీ అయ్యాను. ఈ విషయం రాజ్యానికి ఎలా చెప్పనురా?'

ప్రకాశంవద్దనుంచి నేనేమీ జవాబు ఆశించలేదు. ●